క్లుప్తంగా

కబరస్తాన్‌కు భూమి దానం

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లిలో ముస్లింలకు శ్మశానవాటిక(కబరస్తాన్) లేక ఇబ్బంది పడుతుండగా.. గ్రామానికి చెందిన రైతు ఎండీ భాషా 3 కుంటల సొంత భూమిని దానం చేశారు. ఈమేరకు భాషాను పలువురు అభినందించారు.

108లో ప్రసవం

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన శిరీష అనే గర్భిణి గురువారం పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈక్రమంలో మార్గ మధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది ప్రసవం చేయగా.. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండగా.. వారిని ఖమ్మం తరలించాక ఎమర్జెన్సీ టెక్నీషియన్ రాణి, పైలట్ శ్రీనును పలువురు అభినందించారు.

నియామకం

నేలకొండపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా కే.వీ.రెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మోటాపురంలో జరిగిన మండల మహాసభలో మొత్తం 23 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పార్టీకి చాలా ఏళ్లుగా సేవలందించి రిలీవ్ అయిన ఏటుకూరి రామారావు, పొన్నం శివరాజులను ఘనంగా సన్మానించారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన సీపీ



కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఢిల్లీలో ఈనెల 20న జరిగిన జరిగిన వేదాంత హాఫ్ మారథాన్ రన్‌లో పతకం సాధించిన కానిస్టేబుల్ పిల్లి రాజును పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. మొత్తం 36వేల మంది పాల్గొనగా, రాజు 1.53 నిమిషాల్లో రన్ పూర్తిచేశాడు. ఈసందర్భంగా ఆయనను సీపీ అభినందించగా, ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

తిరుమలాయపాలెం: మండలంలో ఎరువుల కొరత సృష్టించి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కూసుమంచి ఏడీఏ సరిత హెచ్చరించారు. గురువారం మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం తదితర గ్రామాల్లో సహకార, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్లు, బిల్ బుక్స్ పరిశీలించి గోడౌన్‌లలో స్టాక్‌ను పరిశీలించారు. రైతుల ఆధార్ కార్డు ద్వారా పీఓఎస్ మిషన్ ద్వారానే ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నేకల్‌లో పొలంబాట

కామేపల్లి: రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని పొన్నేకల్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కెపాసిటర్లను అమర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో వివరించి విద్యుత్ భద్రత పాటించాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికసాంద్రత విధానంతో రెండో పంటకు అనుకూలం

రఘునాథపాలెం: రైతులు అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే, డిసెంబర్ కల్లా కోతలు పూర్తిచేసి రెండో పంటగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని గణేశ్వరంలో అధిక సాంద్రత విధానంపై వైరా కేవీకే ఆధ్వర్యాన గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఏడీఏ కె.వెంకటేశ్వరరావు, వైరా కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్, నాగపూర్ పత్తి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సంపత్, ఏఈఓ కె.ఉమామహేశ్వర రెడ్డితో పాటు కేవీకే నుంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అధిక సాంద్రతలో పత్తి సాగుతో సుమారు 12 క్వింటాళ్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. కాగా, ప్రైవేట్ కంపెనీలు మొక్కజొన్న విత్తనోత్పత్తి రకాల సాగుకు వస్తే ముందుగా అగ్రిమెంట్ చేసుకోవాలని, తద్వారా నష్టం ఎదురైనా ఇబ్బంది ఉండదని తెలిపారు.

భవితకు భరోసా..!



బోధనకు కేటాయించిన వాహనం, ఇతర పరికరాలు

ఏటీసీలో కొత్త కోర్సుల భర్తీకి కసరత్తు

- ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు
- చైర్మన్‌గా అదనపు కలెక్టర్
- సీట్ల భర్తీకి విస్తృత ప్రచారం
- 30తో ముగియనున్న ప్రవేశాల గడువు



టేకులపల్లి ఐటీఐ కళాశాల

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలంటే అంతా ఆషామాషి కాదు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థి స్థాయిలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యాన.. వాటిలో ప్రవేశాలపై అవగాహన కల్పించి విద్యతోనే ఉపాధి అవకాశాలు కలుగుతాయని చైతన్యపరుస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకే ప్రవేశాలకు అవకాశం ఉండడంతో అదనపు కలెక్టర్ శ్రీజ చైర్మన్‌గా వ్యవహరిస్తూ భర్తీకి కసరత్తు చేస్తున్నారు.

ప్రవేశాల పెంపునకు కసరత్తు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఐటీఐ కళాశాలలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)గా మార్చింది. ఈనేపథ్యాన ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐ కళాశాల ఒకటిగా ఉండడంతో ఆరు కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ కోర్సులతో త్వరితగతిన ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉండడంతో ప్రవేశాల పెంపునకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

విస్తృత ప్రచారాలు..

ఏటీసీల్లో ప్రవేశాల కోసం కళాశాల ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం కొత్త కోర్సులపై అవగాహన కల్పించేందుకు వాల్ పోస్టర్లను సైతం రూపొందించి పలు ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https: iti. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 91008 52344, 70957 39332 నంబర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఆరు కొత్త కోర్సుల వివరాలు..

కోర్సులు	మొత్తం సీట్లు	పూర్తయినవి
మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్	40	17
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మానుఫ్యాక్చరింగ్	40	40
ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	20	13
బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్)	24	01
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్	24	24
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్	24	24
మొత్తం	172	119

అధికారుల సమన్వయంతో..

ఏటీసీలో ప్రవేశాల పెంపునకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అంతేకాక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, డీపీఓ ఆశాలత, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ తుంబూరు సునీల్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు, డీపీఆర్వో యాకుబ్ పాషా, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌లను సభ్యులుగా నియమించారు. వీరంతా తమ పరిధిలోని అధికారులు, సిబ్బంది ద్వారా వారి పరిధిలో ఎస్సెస్సీ పూర్తయిన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన వారి వివరాలను సేకరించి కొత్త కోర్సులపై అవగాహన కల్పించి ప్రవేశాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యాన ఇటీవల ఐటీఐల్లో ప్రవేశాల పెంపు కోసం రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

ఉపాధి అవకాశాలుంటాయి..



రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ(ఏటీసీ) కళాశాలల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టింది. ఆరు కోర్సుల్లో 172 సీట్లు ఉండగా.. 119 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉన్న నేపథ్యాన విద్యార్థులు ప్రవేశాలు పొంది ఉపాధి అవకాశాలు పొందాలన్నారు.

– పి.శ్రీజ, అదనపు కలెక్టర్

అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం..



ఐటీఐ కళాశాలకు ఇటీవల ఆరు కొత్త కోర్సులు మంజూరు కాగా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుంది. 172 సీట్లకు గాను 138 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేసేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– ఎ.శ్రీనివాసరావు, ఐటీఐ ప్రిన్సిపాల్, టేకులపల్లి

మానసిక దివ్యాంగురాలికి కలెక్టర్ ఆర్థిక సాయం



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంఅర్బన్: ఏపీలోని ప్రకాశం జిల్లా పొంగులూరు గ్రామానికి చెందిన 35 ఏళ్ల వయసున్న దాసరి రమాదేవి మతిస్థిమితం లేకుండా పెద్దగోపతి గ్రామంలో తిరుగుతుండగా.. పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ రెండున్నర ఏళ్లుగా జీవనం సాగించి ఇటీవల కోలుకున్నాక తన వివరాలు తెలపడంతో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈమేరకు రమాదేవితో పాటు ఆమె తల్లి కుమారి, కుటుంబసభ్యులతో కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా రమాదేవి తల్లితో కలెక్టర్ మాట్లాడి మానవతా దృక్పథంతో ఖర్చుల నిమిత్తం రూ.10 వేల చెక్కును అందజేశారు.

మెకానిక్ కుటుంబానికి..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పట్టణానికి చెందిన టూవీలర్ మెకానిక్ ఏలూరి నాగేశ్వరరావు గత 20 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి తమ వంతు సహకారం అందించాలని మెకానిక్‌ల యూనియన్ ఆధ్వర్యాన గురువారం జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య ఉషాకు అందించారు. ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ యూనియన్ కమిటీ సభ్యులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టూవీలర్ మెకానికల్ సంయుక్తంగా ఆర్థిక సాయం అందించినట్లు నాయకులు తెలిపారు. ప్రతీ ఒక్క మెకానిక్ యూనియన్‌లో సభ్యత్వం కలిగి ఉండాలని, మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించి ప్రమాద బీమా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లింగనబోయిన మురళి, పులుసు శీను, అన్నదేవర భద్రం, పావురాల విజ్ఞానప్రసాద్, దేవరకొండ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ట్రైయినీ అధికారుల పర్యటన



తిరుమలాయపాలెం: సుబ్లేడు పోస్టాఫీస్‌ను పరిశీలిస్తున్న ట్రైయినీ సివిల్ సర్వీసెస్ అధికారులు

కామేపల్లి/తిరుమలాయపాలెం : కామేపల్లి మండలంలోని జగన్నాథతండా, జాస్తిపల్లి గ్రామాల్లో ట్రైయినీ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం పర్యటించారు. జాస్తిపల్లిలో ఉపాధి పనులను పరిశీలించి పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, పనికి తగ్గిన వేతనం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జగన్నాథతండాలో వన నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం, నాటడం, సంరక్షణ వంటి అంశాలను తెలుసుకుని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మనీశ్ మీనా, సులేఖ జాగర్వాల్, అరుళ్‌సెల్వన్, నీలేశ్‌శ్రీకాంత్‌గైక్వాడ్, మధవధాని, మండల అధికారులు ఎంపీడీఓ రవీందర్, ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఎంఈఓ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు గ్రామంలో ట్రైయినీ సివిల్ సర్వీస్ అధికారులు రూపెష్ జహవాల్, తరుణ్‌పాండ్యా, సుమిత్ గోవింద్‌బామ మక్‌వానా, అభిషేక్ అండసు, ఉషాయాదవ్, సావంత్ మినాల్ మహాదేవ్‌లు గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోస్టాఫీస్, బ్యాంకులను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లు పరిశీలించి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కె.నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యురాలు వసుంధర, ఉపాధి హామీ ఏపీఓ కె.నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



పాతలింగాల పెద్ద చెరువులో చేపల విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై అందించిన చేప పిల్లలను మండలంలోని పాతలింగాల పెద్దచెరువులో విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 876 చెరువుల్లో కోటి 75 లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తోందని, కామేపల్లి మండలంలోని 6 పెద్ద చెరువుల్లో 3.84 లక్షలు, 55 చెరువులు, కుంటల్లో 4.53 లక్షలు వేలు చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలన్నారు.మత్స్యకారుల సొసైటీ సభ్యులకు ప్రభుత్వం ద్వారా అందించే రాయితీ పథకాలను అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం మండలంలోని కామేపల్లి, కెప్టెన్‌బంజర, కొండాయిగూడెం పెద్ద చెరువుల్లో చేప పిల్లలను స్థానిక మత్స్య సొసైటీ అధ్యక్షులు చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, తహసీల్దార్ సుధాకర్, ఏఓ తారాదేవి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లులతో పాటు ధనియాకుల హన్మంతరావు, గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, గుజ్జర్లపూడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు ప్రదానం



అవార్డులు అందిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: 2024 వాసవీక్లబ్ ఖమ్మం, వాసవీ క్లబ్ రోటరీనగర్, వాసవీ క్లబ్ పులిపాటినగర్‌లలో చేసిన సేవలకు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, జోన్ చైర్మన్లకు లక్ష్మీప్రసన్న ధనుంజయజోన్ సోషల్ అవార్డులు ప్రదానం చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ తేలుకుంట్ల ధనంజయ ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలోని త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై వాసవీక్లబ్ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు కడవెండి శ్రీనివాస్ చేతుల మీదుగా కొంకిమళ్ల విశ్వేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, కొదుమూరి భద్రయ్య, శేషు, హనుమంతరావు, విజయ్‌కుమార్, శెట్టి శ్రీకాంత్‌లకు బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరీ, బెస్ట్ ట్రెజరర్, బెస్ట్ ప్రాజెక్టు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, వరప్రసాద్, జగన్నాథం, తిరుమలరావు, హరినాథ్, పుల్లారావు, రమేష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, రామకృష్ణ, ఓంకార్, టి.శ్రీనివాస్, యుగంధర్, ప్రసాద్, లక్ష్మీనరసింహారావు, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. మొత్తం 40 మంది విద్యార్థులకు రెండు జతల దుస్తులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం నందిగామ ఆనంద్ మాట్లాడగా.. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల యాజమాన్యం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నిత్యం వందల సంఖ్యలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే రోగులను పరీక్షించే వైద్యులు మొదలుకొని స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది కొరతతో సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని, అన్ని వైద్య సేవలను, పరీక్షలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, డివిజన్ నాయకులు ఆవుల మంగతాయి, పి.శోభ, కె.శ్రీనివాస్, ఎం.సురేష్, నగర నాయకులు సత్తార్‌మియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడులో నవంబర్ 3న జరిగే సీపీఎం రూరల్ మండల 9వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. గురువారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పత్తితీత మొదలుకావడంతో తేమ శాతంతో సంబంధం లేకుండా సీసీఐ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.2లక్షల పైబడిన రైతులందరీ రుణాలను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే మాఫీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, పి.వెంకటరమణ, వి.సుదర్శన్‌రెడ్డి, బి.నాగేశ్వరరావు, వి.మోహన్‌రావు, రామయ్య, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పాత రైడర్లను తొలగించేందుకు కుట్ర'

ఖమ్మం మామిళ్లగూడెం: గత నాలుగేళ్లుగా ఖమ్మంలో పనిచేస్తున్న పాత రైడర్లను తొలగించి కొత్త వారిని తీసుకొని స్విగ్గీని నిర్వహించాలని యాజమాన్యం కుట్ర చేస్తుందని స్విగ్గీ యూనియన్ జిల్లా నాయకుడు కృష్ణ ఆరోపించారు. ఈమేరకు గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతరైడర్లను తొలగించాలనే ఆలోచనను మానుకోవాలని, లేకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అవినాష్, రమేష్, సురేష్, ఆరిఫ్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

29 కల్లా సభ్యత్వాలు పూర్తి చేయండి

నేలకొండపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ఈ నెల 29 లోగా పూర్తి చేయాలని బీజేపీ సభ్యత్వ జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కొత్తకొత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదులో మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలపాలన్నారు. ఈ సమావేశంలో పాలేరు కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి, మన్నె కృష్ణారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, షేక్ షరీఫుద్దీన్, పిట్టల సూరిబాబు, గెల్లా చక్రపాణి, ఎలిగేటి నరసింహారావు, బాజా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

3న వనసమారాధన

తిరుమలాయపాలెం: వచ్చే నెల 3న సకల ఉద్యోగుల ఆధ్వర్యాన నిర్వహించే వనసమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీవీవీపీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృపాఉషశ్రీ కోరారు. గురువారం తిరుమలాయపాలెం సీహెచ్‌సీ ఆస్పత్రి, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో దీనికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమర్‌సింగ్, డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ రాజకుమార్, టీఎన్‌జీఓ నాయకులు జెడ్‌ఎస్ జయపాల్, బుసా చంద్రశేఖర్, బిట్రా ప్రవీణ్, ఆర్ఐ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: భరతనాట్య పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్, వేదాద్రిలో నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, శ్రీ మువ్వా గోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీలు నిర్వహించిన భరతనాట్యం పోటీల్లో వై.వర్ష, లక్షణ్య కుమరేష్, జి.మాన్వి, జి.ఆద్య, పి.యోగ్నశ్రీలు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.

మధ్యగేటు మూసివేతతో అవస్థలు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మంలోని కమాన్‌బజార్ – గాంధీచౌక్ వెళ్లే మార్గంలో ఉన్న రైల్వేగేట్‌ను అధికారులు మూసివేశారు. మూడోలైన్ నిర్మాణ పనుల కారణంగా ఈ గేట్‌ను మూసివేయడంతో కమాన్‌బజార్, గాంధీచౌక్, త్రీటౌన్ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కూసుమంచి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కోరారు. గురువారం కూసుమంచిలోని జలగం వెంగళరావు జూనియర్ కళాశాలలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యారంగ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం అదే తీరుతో వ్యవహరిస్తుందని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తీవ్రతరం అవుతాయని హెచ్చరించారు. అనంతరం కళాశాల నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా బబ్లూ, కార్యదర్శిగా రాము ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం ఉమేష్, బోడ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో క్రెష్ సెంటర్లు ఆపాలని వినతి

కూసుమంచి: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పాటు చేస్తుందని, ములుగు జిల్లాలో ఇందుకు శ్రీకారం చుట్టగా ఈ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. క్రెష్ విధానంలో అంగన్‌వాడీ సిబ్బందికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఐసీడీఎస్‌లను రక్షించాలని, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, జిల్లా నాయకులు స్వప్న, ధనలక్ష్మి, రత్నకుమారి, ఉమ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేశారని ఆత్మహత్యాయత్నం

రఘునాథపాలెం: ఇంటి స్థలం ఇప్పిస్తామనని డబ్బు తీసుకుని స్థలం అప్పగించకుండా, నగదు తిరిగి ఇవ్వకపోవడంతో ఆవేదన చెందిన రఘునాథపాలెంకు చెందిన ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రఘునాథపాలెంకు చెందిన మొగిలి సుధాకర్ కేటీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన లక్ష్మణ్ నుంచి కాలనీలో 150 గజాల ఖాళీ స్థలాన్ని 2023 జులై 27న రూ.3.20లక్షలకు కొనుగోలు చేశాడు. తొలుత రూ.2.10 లక్షలు చెల్లించగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించకపోగా డబ్బు తిరిగి ఇచ్చేస్తానన్న లక్ష్మణ్ తిప్పిస్తున్నాడని తెలిసింది. దీంతో లేఖ రాసిన సుధాకర్ ఈనెల 22న ఎలుకల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనపై సీఐ ఉస్మాన్ షరీఫ్‌ను వివరణ కోరగా ఆత్మహత్యాయత్నం ఫిర్యాదు అందలేదని తెలిపారు. అయితే, డబ్బుల విషయమై ఫిర్యాదు చేసినా తిరిగి ఇచ్చినట్లు చెబుతూ వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు.


ఇద్దరు కూలీలకు పాముకాటు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన బి.నాగమ్మ (30) అనే మహిళ రోజుమాదిగానే గురువారం బోనకల్ మండలంలోని ముష్టికుంట గ్రామంలో పత్తి తీసేందుకు వెళ్లింది. పత్తి తీస్తుండగా పాము కాటేయడంతో ఖమ్మంకు తరలించారు. అలాగే మంగాపురంతండాకు చెందిన కవిత అనే మరో కూలీ గ్రామంలో మిర్చి తోటలో పని చేస్తుండగా పాము కాటేసింది. దీంతో నేలకొండపల్లి ప్రభుత్వాస్పత్రి తరలించి చికిత్స అందించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు.

ఇరువర్గాల ఘర్షణ..

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం గ్రామంలో వ్యవసాయ పొలం గెట్ల విషయంలో ఇరువర్గాల మధ్య పంచాయితీ జరిగింది. ఈ క్రమంలో ఇరువర్గాల వారు పరస్పర దాడులకు పాల్పడగా.. ఓ వర్గానికి చెందిన వి.రామారావు, వెంకటేశ్వర్లు, లలితలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి అపై ఖమ్మం తరలించారు. ఈ విషయం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మంరూరల్: కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా నాయకుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. మండలంలోని కాచిరాజుగూడెంలో గురువారం జరిగిన గ్రామ మాజీ సర్పంచ్ ప్రతాపనేని సత్యనారాయణ ఎనిమిదో వర్ధంతిలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధి కోసం సత్యనారాయణ ఎంతో కృషి చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా జమిలి ఎన్నికల పేరుతో కొత్త నాటకాలకు తెరలేపుతోందన్నారు. ఓవైపు నిరుద్యోగం, పేదరికం పెరుగుతున్నా పట్టించుకోకుండా 40 శాతం ఆదాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ పేదలపై భారం మోపుతోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గాంధీ, కృష్ణ, జి.లక్ష్మీనారాయణ, బి.నాగేశ్వరరావు, పి.వెంకన్న, వీరయ్య, చిన్ని తదితరులు పాల్గొన్నారు.